ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 15 జూలై 2024 | 5

ఫోర్‌బై రిజర్వాయర్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

చింతలూరులో విషాదఛాయలు... 7లో

తవ్వండి... వద్దు



కూనవరం సముద్రం మొగ

- కూనవరం సముద్ర మొగ తవ్వకంపై భిన్నాభిప్రాయాలు
- తవ్వితే మునిగిపోతామంటున్న ఎగువ రైతులు
- తవ్వకుంటే సాగు సాగదంటున్న దిగువ రైతులు
- మొగ మూసి ఉంటే ఉపాధి కోల్పోతామంటున్న మత్స్యకారులు
- శాశ్వత చర్యలే పరిష్కారమంటున్న అన్ని వర్గాలు
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



సముద్రాన్ని ఆనుకుని ఉన్న ఉప్పునీటి పర్ర

ఉప్పలగుప్తం, జూలై 14: రైతుల పాలిట దుఃఖదాయిని, కాంట్రాక్టర్లకు వర ప్రదాయినిగా ప్రసిద్ధికెక్కింది కూనవరం సముద్రం మొగ. ఏటా తవ్వడం... నెలల వ్యవధిలో మూసుకుపోవడం.... దశాబ్దాల తరబడి పరిస్థితిలో మార్పులేదు. కోనసీమలోని అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన మండలాల్లోని అధిక విస్తీర్ణంలో పొలాల నుంచి మురుగునీరు రెవెన్యూ, మినీ, మీడియం డ్రెయిన్ల ద్వారా కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి ప్రవహిస్తుంది. ఈ డ్రెయిన్ ఎస్.యానాం-రాఘవులపేట మధ్య వంతెన నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో కలుస్తుంది. ఇక్కడ డ్రెయిన్‌కు, సముద్రానికి అనుసంధానంగా ఉన్న గండినే మొగ అంటారు. 1992కు పూర్వం వరకు మొగ తెరుచుకుని ఉండేది. అనంతర కాలంలో గండి మూసుకుపోయింది. 1992లో డ్రెడ్జర్లతో తవ్వి కృత్రిమంగా గండిని ఏర్పాటు చేశారు. తుపానుల సమయంలో సముద్రం అలలకు ఇసుక మేటలు వేసి గండి మూసుకుపోయింది. అప్పటి నుంచీ పలుమార్లు మొగ తవ్వకాలు జరిగినా కాంట్రాక్టర్లకు తప్ప రైతులకు ప్రయోజనం చేకూరిన దాఖలాలు లేవు. తవ్వడం, నెలల వ్యవధిలోనే మూసుకుపోవడం పరిపాటిగా మారింది. అమలాపురం ఎంపీగా జీఎంసీ బాలయోగి ఈ మొగ సంరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. లోక్‌సభ స్పీకర్ హోదాలో సైతం ఆయన పలుమార్లు పడవలో మొగకు చేరుకుని శాశ్వతంగా ఉండేందుకు చేపట్టవలసిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. అనంతర కాలంలో ప్రభుత్వాలు అంతంతమాత్రంగానే స్పందించినప్పటికీ 2014లో టీడీపీ ప్రభుత్వం మొగపై పూర్తిగా దృష్టి పెట్టింది.

రూ.100 కోట్లతో ప్రాజెక్టు రూపకల్పన

2014లో అప్పటి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తు ఆనందరావు అభ్యర్థన మేరకు హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ ప్రాంతంలో పర్యటించి రైతులతో చర్చించారు. ఇంజనీరింగ్ నిపుణులను రప్పించి కూనవరం మొగ శాశ్వతంగా ఉండేందుకు రూ.100కోట్లతో ప్రాజెక్టు రూపకల్పన చేశారు. కూనవరం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ, ఇరువైపులా డ్రెయిన్ గట్ల పటిష్టత, మొగ మూసుకుపోకుండా రాతితో రివిట్‌మెంట్, సముద్రం ఆటుపోటులకు ఉప్పు నీరు పంట పొలాల్లోకి పోకుండా మొగ సమీపంలో డ్రెయిన్‌లో ఆటోమెటిక్ షట్టర్ల ఏర్పాటు తదితర అంశాలు ఈ ప్రాజెక్టులో ఉన్నాయి. పనుల ప్రారంభ దశలో ప్రభుత్వం మారడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. గత ఐదేళ్లలో రైతుల మొరను పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.



మొగ తవ్వకాన్ని వ్యతిరేకిస్తూ చీకట్లపాలెంలో సమావేశమైన ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రైతులు (పాత చిత్రం) (ఎడమ) మొగ వద్ద ఇసుకమేటలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రైతు నాయకులు (పాత చిత్రం) (కుడి)



మొగ మూతపడితే ఉపాధి కోల్పోతున్నాం

మత్స్యకారులు

మొగ తెరుచుకునే ఉంటే సముద్రంలోని విలువైన మత్స్య సంపద పర్రలోకి వస్తుంది. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లోని వందల కుటుంబాలు చేపల వేటపై పొట్టపోసుకుంటున్నాయి. మొగ తవ్వకపోతే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పర్ర ఆక్రమణలకు గురికావడంతో మొగ తవ్వకాల వల్ల ఎగువ పొలాలకు ముంపు సమస్య వస్తోంది. మొగ తవ్వితే కొందరు రైతులకు కీడు జరుగుతుందని మేమూ ఒప్పుకుంటాం. డ్రెయిన్ గట్లను పటిష్టం చేసి, ఆటోమేటిక్ షట్టర్లు ఏర్పాటుచేసి మొగ తవ్వితే అందరికీ ప్రయోజనమే. ఈ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

ప్రాజెక్టు అమలు చేస్తే అందరికీ మంచిదే

ఎగువ, దిగువ రైతులు

మొగ తవ్వితే పొలాలు, చేపల చెరువులు ఉప్పునీటికి దెబ్బతింటాయని మొగ ఎగువ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రైతులు ఇటీవల చీకట్లపాలెంలో సమావేశమై మొగ తవ్వొద్దని తహసీల్దారుకు విన్నవించుకున్నారు. అనంతరం కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకులు కలెక్టర్‌ను కలిసి మొగ వద్ద ఇసుక మేటలు తొలగించి దిగువ ప్రాంత రైతులను ఆదుకోవాలని విన్నవించారు. మరి మొగ తవ్వాలంటే శాశ్వత ప్రాజెక్టు అమలు చెయ్యాల్సిందేనన్నది అందరి వాదన.

కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేసిన ప్రాజెక్టు అమలుచెయ్యాలని రైతులు కోరుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే అయిన అయితాబత్తుల ఆనందరావే ఇప్పుడూ అధికారంలో ఉన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కూనవరం మొగ అంశంపై చర్చించి నాలుగు మండలాల రైతులతో పాటు రెండు మండలాల మత్స్యకారుల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేయలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.




పంట కాల్వ కుడి గట్టు రక్షణ గోడ కూలిన దృశ్యం

కూలిన పంట కాల్వ రక్షణ గోడలు

సాగునీటికి ఆటంకం

ముమ్మిడివరం, జూలై 14: మాగాం-అయినాపురం పంట కాల్వకు గతంలో నిర్మించిన రక్షణ గోడలు కూలిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాల్వ గట్టు కుడి రక్షణ గోడ 100 నుంచి 150 మీటర్ల మేర కూలిపోయింది. కుడి గట్టు రక్షణ గోడలు కూడా ఒరిగిపోయాయి. 1998-99 సంవత్సరంలో బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దే ప్రాజెక్టులో భాగంగా రూ.35లక్షలతో ఎడమ కాల్వ గట్టుకు సీసీ రోడ్డు,కాల్వకు తొట్టె, రక్షణ గోడలు, వంతెనలు, లైటింగ్ పనులు చేశారు. 930 మీటర్ల మేర పంట కాల్వకుతొట్టె నిర్మించారు. పంట కాల్వకు కుడి ఎడమ పక్కన తొట్టెకు గోడల నిర్మాణం జరిగింది. ఈ పంట కాల్వకు సాయిబాబా ఆలయ సమీపంలో కుడిగట్టు 100 నుంచి 150 మీటర్లు రక్షణ గోడ పంట కాల్వలోకి కూలిపోయింది. ఎడమ గట్టు రక్షణ గోడ కూడా ఒరిగిపోయింది. రక్షణ గోడ కూలి తొట్టెలోపడిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది.దీంతో సోమిదేవరపాలెం, అయినాపురం గ్రామాలకు సంబంధించి వరి పొలాలు, సాగునీటి సరఫరాకు అవరోధం కలిగింది. కూలిన రక్షణ గోడలను తొలగించి కాల్వకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.



పంట కాల్వ ఎడమ గట్టు రక్షణ గోడ ఒరిగిన దృశ్యం

నేడు యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ఉప్పలగుప్తంలో పాల్గొననున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలగుప్తంలో నిర్వహించే మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొంటారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డివిజనల్, మండల స్థాయి అధికారులు కూడా పాల్గొంటారు. మండల స్థాయిలో ప్రజలు తమ సమస్యలను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు అందించి తగు పరిష్కార మార్గాలు పొందాలని కోరారు. జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుంది.



ఓఎన్జీసీ రోడ్డు కొట్టుకుపోయిన ప్రాంతంలో తీగ చిక్కంతో రాళ్ల అమరిక

జియో ట్యూబ్‌తో రక్షణ చర్యలు

అల్లవరం, జూలై 14: సముద్ర రాకాసి అలలకు మండలంలోని ఓడలరేవు తీరంలో కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రోడ్డు వద్ద జియో ట్యూబ్ విధానంలో రాళ్లతో రక్షణ చర్యలు చేపట్టారు. 'సముద్ర అలలకు కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రోడ్డు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన సంగతి విదితమే. ఓఎన్జీసీ ప్లాంటుకు రక్షణగా ఉన్న ప్రహరీ సమీపంలో సముద్ర కెరటాల కట్టడికి రాళ్లతో తాత్కాలిక రక్షణ చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాళ్లు కొట్టుకుపోకుండా తీగ చిక్కంతో రాళ్లు అమరుస్తున్నారు.

అన్న క్యాంటీను ఏర్పాటుకు స్థల పరిశీలన

అమలాపురం టౌన్, జూలై 14: అమలాపురంలో అన్నార్తులను ఆదుకునేందుకు త్వరలోనే అన్న క్యాంటీను ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపాన ఉన్న కూరగాయల మార్కెట్ ప్రాంతం వద్ద స్థలాన్ని అన్నక్యాంటీను ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించారు. మరికొన్నిప్రాంతాల్లోనూ పరిశీలన జరిపారు. మార్కెట్ ఏరియాలో క్యాంటీను ఏర్పాటు చేయడం వల్ల అక్కడ పనిచేసే కార్మికులతో పాటు మార్కెట్‌కు వచ్చే వారికి కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా శాఖ అధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, తిక్కా సత్యలక్ష్మి, గొలకోటి విజయలక్ష్మి, జంగా అబ్బాయివెంకన్న, గండి స్వామి, నల్లా మల్లిబాబు వున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు




ముంపులో పొలాలు

ఆత్రేయపురం, జూలై 14: వాయుగుండం ప్రభావంతో గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు జలదిగ్బంధమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ముంపునీరు బయటకు వెళ్లే మార్గం పొలాలు ముంపులో ఉన్నాయి. ఆత్రేయపురం, లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, కట్టుంగ గ్రామాల్లోని వరి పొలాలు, నారుమడులు, వరినాట్లు వేసుకున్న పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. పులిదిండిలో కూరగాయలు, ఆకుకూర పంటలు నీటమునిగాయి. అప్పులు చేసి పంట పండించిన రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా మురుగు డ్రెయిన్లలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ముంపునీరు వెళ్లే మార్గం లేకే ఈ పరిస్థితి దాపురించింది.





పులిదిండిలో నీట మునిగిన కూరగాయల పంట, ఆకుకూరల పంట



శాకంబరీ... నమోస్తుతే!

ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా జిల్లాలో పలుచోట్ల అమ్మవార్లు శాకంబరిగా దర్శనమివ్వగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లిని పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. (పై చిత్రంలో) అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి సోదరి గుర్రాలక్కమ్మ (అశ్వరూఢాంబిక) అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాకంబరిగా అలంకరణ చేశారు.... 8లో

జగన్ పాలనలో ఐటీడీఏల నిర్వీర్యం

మూడేళ్లుగా పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఆర్థిక లావాదేవీలు

రంప, పాడేరు, చింతూరు ఐటీడీఏలలో రూ.పదుల కోట్లలో నిధుల ఖర్చు



రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం

(రంపచోడవరం): జగన్ పాలనలో అల్లూరి జిల్లాలోని కలెక్టర్ అధ్యక్షతన నడిచే రంపచోడవరం, చింతూరు, పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)లు నిర్వీర్యమయ్యాయి. గత మూడేళ్లుగా ఒక్కసారి కూడా పాలకమండలిని సమావేశపర్చకుండా మూడు ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేశారు. పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఈ మూడు ఐటీడీఏల్లో ఆర్థిక లావాదేవీలు చట్టవిరుద్ధంగా ప్రహసనంగా సాగిపోయాయి. ప్రభుత్వ శాఖగా కాకుండా స్వయం ప్రతిపత్తి సొసైటీలుగా ఏర్పాటైన ఐటీడీఏలు సొసైటీల చట్టం కింద రూపొందించుకున్న నియమావళి మేరకే నడవాల్సి ఉంది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడిగానూ, పార్లమెంటు సభ్యుడు శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల మండల ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు సభ్యులుగా కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకమండలి సమావేశమై ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించుకుంటూ ఆ మేరకు మాత్రమే కార్యకలాపాలను, ఆర్థిక లావాదేవీలను ఈ ఐటీడీఏ సొసైటీల్లో నిర్వహించాలి. ఏడాదికి ఒక వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించని దుస్థితిలో రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలలో ఒక్కసారి కూడా పాలకమండలి ఆమోదం తీసుకోకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా పదుల సంఖ్యలో కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేశారు.. ఈ ప్రకారం ఈ ఐటీడీఏలు నిర్వీర్యమై చట్టబద్ధతను కోల్పోయాయి. నిబంధనల ప్రకారం ఐటీడీఏల ద్వారా అమలయ్యే ఏ కార్యకలాపమైనా పాలకమండలి ఆమోదంతోనే జరగాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల రాబడి, చేపట్టే కార్యక్రమాలు, ప్రణాళికలు, వ్యయాలు తదితర అంశాలన్నింటినీ పాలకమండలి ఆమోదించాల్సిందే! కానీ గత మూడేళ్లుగా ఈ ఐటీడీఏలలో పాలకమండలి ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయలతో కార్యకలాపాలు సాగాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా గడిచిన 48 సంవత్సరాలలో ఒక్క కొవిడ్ కాలంలో మినహా ఐటీడీఏల్లో పాలకమండలి సమావేశం లేని సంవత్సరమంటూ లేదు. 2019 డిసెంబరు తర్వాత రంపచోడవరం, 2021 సంవత్సరం డిసెంబరు, 28 తర్వాత చింతూరు ఐటీడీఏ, 2022 ఏప్రిల్ తర్వాత పాడేరు ఐటీడీఏల్లో పాలకమండళ్లు లేకుండానే కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. తద్వారా ఈ ఐటీడీఏల్లో అధికారులు సాగించిన కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధత లోపించింది. అంతేకాకుండా కోట్లాది రూపాయల నిధులను కూడా పాలకమండలి ఆమోదం లేకుండానే అప్పటి ప్రభుత్వ అవసరాలకు మళ్లించేశారు. సొసైటీ చట్ట నిబంధనల ప్రకారం ఇంతవరకూ సాగిన కార్యక్రమాలకు చట్టబద్ధత లేనట్టేనా అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్న తరుణంలో గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసి ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టరుగా వచ్చిన దినేష్‌కుమార్ ఈ మూడు ఐటీడీఏలను అధ్యక్షుడిగా ఎలా నిర్వహిస్తారో వేచి చూడాలి..



సత్యదేవుని భక్తుల కోసం నూతన క్యూలైన్

అన్నవరం, జూలై 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో రూ. 300 వ్రతం ఆచరించుకునే భక్తులకు వ్రతం అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు ప్రత్యేక క్యూలైన్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వ్రతం అనంతరం భక్తులు దర్శనం కోసం ఎండ, వానలలో బాధపడతూ దర్శనానికి చేరుకునేవారు. అంతేగాకుండా శని, ఆదివారాల్లో స్వామివారి ప్రాకారసేవ, రథోత్సవం సందర్భంగా బయటనడిచే భక్తులతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే రూ.300 వ్రత మండపం ఎదురుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రత్యేక క్యూలైన్ వద్ద టీటీడీ మాదిరి కూర్చొనేందుకు బల్లలు, ఫ్యాన్లు, తాగునీరు సదుపాయం కల్పించారు. గతేడాది కార్తీకమాసంలో అప్పటి ఈవో ఆజాద్ కంపార్ట్‌మెంట్ మాదిరి ఏర్పాటుచేయగా గాలి, వెలుతురు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కోవడంతో ప్రస్తుత ఈవో దీనిని గమనించి కంపార్ట్‌మెంట్‌లను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో నూతన క్యూలైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరో 10 రోజుల్లో పనులు పూర్తవుతాయని శ్రావణమాసం రద్దీ నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం,జూలై14: చింతూరు మండలం మోతుగూడెం మూడు రోజుల కింద విహారయాత్రకు వచ్చి ఫోర్‌బై రిజర్వాయర్‌లో కాలు జారిపడి గల్లంతైన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ(24) మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం 10గంటలకు పోలీసులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు బెల్మోతు డాం దగ్గర మృతదేహం లభించింది. మృతదేహాన్ని చింతూరు గవర్నమెంట్ హాస్పటల్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు సన్నీ పాల్గొన్నారు.

చింతలూరులో విషాదఛాయలు



ఆలమూరు, జూలై 14: మోతుగూడెం వాటర్ ఫాల్స్ వద్ద గల్లంతైన యువకుడు ఆదివారం విగతజీవిగా తేలడంతో ఆలమూరు మండలం చింతలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం చింతలూరు నుంచి పదిమంది యువకులు మోతుగుడెం వద్ద వాటర్‌ఫాల్స్ దగ్గరకు వెళ్లారు. వీర మురళీకృష్ణ అనే యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి గల్లంతయ్యాడు. రెండు రోజులుగా గాలించగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. దీంతో చింతలూరులోని మృతుడు మురళీకృష్ణ ఇంటి వద్దకు అతడి బంధువులు, మిత్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

సోకులేరు వాగులో పడి యువకుడి గల్లంతు



మోతుగూడెం, జూలై 14: విహార యాత్రకు వెళ్లిన ఓ యువకుడు సోకులేరు వాగులో పడి గల్లంతయ్యాడు. ఎస్ఐ జి. గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన ఏడుగురు బీటెక్ విద్యార్థులు కారులో ఆదివారం చింతూరు మండలం చదలవాడ పంచాయతీ సోకిలేరు వ్యూ పాయింట్ దగ్గరకు విహారయాత్రకు వచ్చారు. వీరిలో ఇద్దరు అల్లూరి తేజ (24), అవినాష్ వ్యూ పాయింట్ దగ్గర ఉన్న సోకులేరువాగులో దిగి స్నానాలు చేస్తుండగా అల్లూరి తేజ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. తేజను రక్షించడానికి వెళ్లిన అవినాష్ సైతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటే తోటి స్నేహితులు రక్షించండి అంటూ చేస్తున్న ఆర్తనాదాలు విని స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని అవినాష్‌ను సురక్షితంగా బయటకు లాక్కొచ్చారు. పోలీసులు, స్నేహితులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా తేజ ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి డీఎంవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్‌లో జూనియర్ గ్రేడ్ పరీక్ష, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అలాగే తెలుగు, ఇంగ్లీషు షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబరు 21, 22 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రం రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున వెంటనే స్థానికంగా ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 31 లోగా సంప్రదించి సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని కోరారు.

భారీగా తాబేళ్లు స్వాధీనం

మోతుగూడెం,జూలై14:చింతూరు మండలం మీదుగా అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. చింతూరు మండలం తులసిపాక అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగాతరలిస్తున్న తాబేళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 246 తాబేళ్లను కాకినాడ నుంచి ఏజెన్సీ మీదుగా ఒడిశాకు తరలిస్తున్న ఒడిశాకు చెందిన సూరజ్ మండల్‌ను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వాహనంలో 246 తాబేళ్లలో 230 తాబేళ్లు సజీవంగా ఉన్నాయని 16 తాబేళ్లు మృతి చెందాయని పట్టుబడ్డ తాబేళ్లను శబరి నదిలో వదిలిపెడతామని లక్కవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి నానాజీ తెలిపారు. సూరజ్‌మండల్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఈ తనిఖీల్లో లక్కవరం సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్, లక్కవరం బీట్ ఆఫీసర్ బి.సరిత, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

పట్టుబడిన యానాం మద్యం



తాళ్లరేవు, జూలై 14: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని బోటుపై తరలిస్తుండగా గోవలంక ఇసుక ర్యాంపు వద్ద కోరింగ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామానికి చెందిన మద్యం వ్యాపారి దండుప్రోలు సతీష్ యానాం నుంచి 13 ప్లాస్టిక్ సంచుల్లో 2,340 లిక్కర్ బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తూ గోవలంక రేవు వద్ద బోటుపై తరలించేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులకు వచ్చిన సమాచారం ప్రకారం కోరింగ ఎస్ఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. మద్యం బస్తాలను స్వాధీనం చేసుకుని బోటును సీజ్ చేశారు. దండుప్రోలు సతీష్‌పై కేసు నమోదు చేసి కాకినాడ స్పెషల్ కోర్టుకు తరలించనున్నట్లు కోరింగ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చిట్టిబాబు, పీసీలు సురేష్, చంద్ర, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

గొల్లప్రోలు, జూలై 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణారావు (59) ఆదివారం గుండెపోటుతో మరణించారు. కాకినాడలోని ఇంటి వద్ద ఉండగా ఆయనకు గుండెపోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది కాలంగా ఆయన గొల్లప్రోలులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఎస్ఐ మృతికి పలువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

గండిపోశమ్మకు పూజలు

దేవీపట్నం, జూలై14: మండల పరిధిలో వేంచేసియున్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి సంబంధించి టిక్కెట్లు తదితర వాటికి కలిపి రూ.19,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి



లోవకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు



తుని రూరల్, జూలై 14: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆషాఢ ఆదివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోను, కాటేజీల్లోను వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పోలీసు యంత్రాంగం రద్దీని నియంత్రించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఈవో విశ్వనాథరాజు మాట్లాడుతూ లోవ క్షేత్రానికి 2వ ఆదివారం 40 వేల మందికి పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోగా క్షేత్ర పరిసరాలకు లక్షకు పైగా భక్తులు వచ్చారన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారన్నారు. వివిధ విభాగాల నుంచి రూ.11.95 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది ఆషాఢ మాసం 2వ ఆదివారంతో పోల్చితే ఈ ఏడాది రూ.92 వేలు అధికంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దాపురం, జూలై 14 : భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు రెండో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


క్యూలో నిల్చున్న భక్తులు

సత్యదేవుడి ప్రసాదం కోసం..

అన్నవరం, జూలై 14: సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావించే స్వామివారి గోధుమరవ్వ ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తలుపులమ్మ లోవ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాలకు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కొనుగోలుకు బారులు తీరారు. కొండపైన, కొండి దిగువున తొలిపావంచా, బైపాస్‌లో రెండు నమూనాలయాల వద్ద కలిపి సుమారు 90 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారి ప్రసాదం అందిస్తున్న అధికారులు

సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జూలై 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఏటూరునాగారం శివారులో ఘోర ప్రమాదం

కంటైనర్ లారీని ఢీకొన్న ఆటో

తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు ఆమె తల్లిదండ్రులు, డ్రైవర్ దుర్మరణం


సత్యనారాయణరాజు, సత్యవతి మృతదేహాల వద్ద రోదనలు


అనిత (ఫైల్‌ఫోటో)

వాజేడు, జూలై 14: ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం శివారులో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు ఆమె తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్ మృతిచెందారు. దీంతో ఏటూరునాగారం సమీప గ్రామం వాజేడులోను, కోదాడలోను విషాదఛాయలు అలుముకున్నాయి. తొండంగి మండలం కోదాడ గ్రామానికి చెందిన తమ కూతురు సాగి అనితను వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులు బస్సు ఎక్కించేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. నాగరాజు అనే డ్రైవర్ ఆటోను కిరాయికి మాట్లాడుకున్నారు. సత్యనారాయణరాజు, సత్యవతి, అనిత ఆటో ఎక్కగా డ్రైవర్ నాగరాజు అదే గ్రామానికి చెందిన యువకుడు అంజిరెడ్డిని తోడుగా తీసుకెళ్లాడు. డ్రైవర్ సహా నలుగురు ఆటోలో బయల్దేరగా ఏటూరునాగారం శివారు హైవే స్ట్రీట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళేబరాన్ని తప్పించబోయిన ఆటో డ్రైవర్.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నాడు. దీంతో ఆటో డ్రైవర్ నాగరాజుతో పాటు సత్యనారాయణ, సత్యవతి దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వారి కూతురు అనితతో పాటు ఆటోలో ఉన్న యువకుడు అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిత కూడా మృతి చెందింది. అనిత మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ నుంచే ఆమె అత్తగారి ఊరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొండంగి మండలం కోదాడకు ఆదివారం తరలించారు. సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులకు ఏకైక సంతానం అనిత. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. గత ఏడాది కూతురి వివాహం చేశారు. అనిత భర్త సాగి సత్యనారాయణరాజు ఇటీవల అనారోగ్య బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

78 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 14:ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 78,209 క్యూసెక్కులు మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.30 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.


నేటి నుంచి అన్నవరం రైల్వేగేటు మూసివేత

అన్నవరం, జూలై 14: అన్నవరం రైల్వేగేటును సోమవారం ఉదయం 7గంటల నుంచి గురువారం సాయంత్రం 5గంటల వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటులో సాంకేతిక సమస్యలు ఉండడంతో మరమ్మతులలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్నవరం నుంచి ఒంటిమామిడి, తొండంగి, కొత్తపల్లి వెళ్లే ప్రయాణికులు గమనించి చిన్నాయపాలెం, రావికంపాడు మీదుగా రాకపోకలు కొనసాగించుకోవాలని కోరారు.

డయేరియా సోకి తగ్గిన వ్యక్తి మృతి

సీతానగరం, జూలై 14: డయేరియా సోకి తగ్గిన వ్యక్తి ఇంటి వద్ద చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రమైన సీతానగరం గ్రామానికి చెందిన పెంటా సుబ్బారావు ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. సీతానగరం పీహెచ్‌సీ డా.చైతన్య విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 2న డయేరియాతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందగా మూడు రోజులలో డయేరియా నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఈ నెల 6న ఆయాసం రావడంతో మూత్రం బంద్ కావడంతో కుటుంబ సభ్యులు సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 10న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేయాలని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరస్కరించి ఇంటికి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని, ఈయనకు మూత్ర పిండాలు పనిచేయకపోవడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు

పోటెత్తుతున్న వరదనీరు


(పైన) వరద ప్రవాహం పెరుగుతున్న దృశ్యం గండిపోశమ్మ ఆలయంలోకి వరద నీరు

దేవీపట్నం, జూలై 14: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వరదనీరు గోదావరికి వచ్చి చేరింది. దీంతో మండలంలో ముంపు గ్రామాలు గత రెండు రోజులు క్రితమే నీట మునిగాయి. గోదావరి ఉధృతి మరింత పెరగడంతో పోశమ్మ గండి వద్ద వరదనీరు పెరిగి ఆదివారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టింది. ఇదే వరద సోమవారం కొనసాగినట్లయితే అమ్మవారి ఆలయంలోకి వరద నీరు చేరి దర్శనాలకు బ్రేక్ పడనుంది. రెండు రోజుల క్రితం దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు చేరడంతో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు గండిపై ఉన్న నాలుగు పంచాయతీలకు సంబంధాలు తెగిపోయాయి.

ఆలోచింపజేసిన నాటికలు


క్షేత్రం నాటికలోని ఓ సన్నివేశం

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 14: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా ప్రదర్శించిన క్షేత్రం నాటిక అందరినీ ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళా మందిరంలో నాలుగో రోజు కార్యక్రమాలను ఎస్ఆర్‌టీ ఇంజనీర్స్ ఎండీ బీఆర్ ప్రసాదరెడ్డి ఆదివారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆడపిల్లలపై జరుగుతున్న వివక్షతను రూపుమాపాలని కోరుతూ గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన క్షేత్రం నాటిక ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది. ఆకురాతి శిల్ప ఈ నాటిక రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. తొలుత గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాలోన నీవే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామిరెడ్డి, పంపన దయానందబాబు, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ ఆర్ బాపిరాజు, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ కార్యదర్శి నాదెండ్ల ప్రభుదాసు పాల్గొన్నారు.

భారీ కొండచిలువ హతం



జగ్గంపేట రూరల్,జూలై14: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారున రాజు పొలంలో జె. కొత్తూరు గ్రామస్తులు పనిచేస్తుండగా కొండ చిలువ కనిపించింది. భయభ్రాంతులకు గురైన వెంటనే సమీప పొలంలో పని చేస్తున్న వారిని పిలిచి హతమార్చారు. ఇప్పటి వరకు ఇటువంటి కొండ చిలువను ఎప్పుడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.

మానవాళికి భగవద్గీత దిక్సూచి

మండపేట, జూలై 14: మానవాళికి భగవద్గీత ఒక దిక్సూచని భగవద్గీతలోని అంశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక బూరుగుంట రామాలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన భగవద్గీత శిక్షణ తరగతులను ఆయన ప్రారంబించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, ఆలయ ట్రస్టీ మల్లిపూడి గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.4.06లక్షలు

ఆత్రేయపురం, జూలై 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,06,274 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన కరుటూరి గిరీష్‌నాగకమల్-ఉమాసుమతి రత్నకుమారి దంపతులు రూ.51,116 విరాళం సమర్పించారు. దాతలకు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఇంటర్ విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం

ఆత్రేయపురం, జూలై 14: ఆత్రేయపురానికి చెందిన వేగేశ్న చారిటబుల్ ట్రస్టు అధినేత, ఎన్‌ఆర్‌ఐ వేగేశ్న రామకృష్ణంరాజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ముదునూరి సహస్రకు రూ.50వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమొత్తాన్ని ఆమె తండ్రి వర్మకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సుబ్బరాజు, స్వర్ణకుమారి, ఏలూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

నేడు డివిజన్ స్థాయి పరిష్కార వేదిక

ఉప్పలగుప్తం, జూలై 14: ఉప్పలగుప్తం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం డివిజన్ స్థాయిలో జరుగుతుందని ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. ఇందులో కలెక్టర్‌తో పాటు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

వైద్య సేవలకు ఆర్థిక సాయం

ముమ్మిడివరం, జూలై 14: ముమ్మిడివరం కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని తోట్లపాలేనికి చెందిన ఆకుమర్తి నాగేంద్రప్రసాద్-శాంతికుమారి కుమార్తె జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితమైంది. చదువులో చురుగ్గా ఉండేది. ముమ్మిడివరం డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు రూ.11,140 సమకూర్చారు. అధ్యాపకుడు కిరణ్‌కుమార్ బృందం ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదు అందించారు. కార్యక్రమంలో కె.దుర్గాప్రసాద్, డి.విజయ్‌కుమార్ ఉన్నారు.

ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై హర్షం

అమలాపురం టౌన్, జూలై 14: ఏడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి 13స్థానాలకు పదిచోట్ల ఘన విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. బీజేపీ దుష్పరిపాలనను ప్రజలు తిరస్కరిస్తున్నారని, ఆ పార్టీ ఓటమి చెంప దెబ్బ లాంటిదని పేర్కొన్నారు. ఇండియా కూటమి విజయం పట్ల కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, కుదుపూడి శ్రీను, పేరి శర్మ, ఆర్లపల్లి ముత్యం, సుగ్గు ప్రసాద్, మొల్లేటి వెంకటేశ్వరరావు, అరిగెల రాంబాబు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు

15రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురంటౌన్/ద్రాక్షారామ, జూలై14: ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన ప్రధానమైన 132 కేవీ కాకినాడ-రామచంద్రపురం లైన్‌ను మార్పు చేయడంలో భాగంగా ఈనెల15 నుంచి 30వరకు విద్యుత్ సరఫరాలో పలుచోట్ల అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో కాకినాడ ఈఈ జె.రామారావు, రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్, అమలాపురం ఈఈ మోకా రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం, అమలాపురం, రాజోలు తదితర ప్రాంతాల్లో ఉదయం 6సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఉంటుందన్నారు.

స్కూటీ డిక్కీలో నల్లతాచు పిల్ల

అమలాపురం రూరల్, జూలై 14: ఎ.వేమవరం పెట్రోల్ బంకు వద్దకు ఆదివారం కారెం దుర్గారావు పెట్రోల్ కోసం స్కూటీపై వచ్చాడు. సీటు డిక్కీ తెరుస్తుండగా నల్లతాచు పాము పిల్ల కనిపించింది. దీంతో పెట్రోల్ బంకు సిబ్బంది స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. డిక్కీలో ఉన్న నల్లతాచు పాము పిల్లను వర్మ చాకచక్యంగా పట్టుకుని నిర్జన ప్రదేశంలో విడిచిపెట్టారు.

దండుగంగాలమ్మ సేవలో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 14: స్థానిక చప్పిడివారి సావరంలో దండుగంగాలమ్మ తీర్థమహోత్సవం పురస్కరించుకుని మంత్రి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గొల్లపల్లి కృష్ణ, నారపరెడ్డి బలరాం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా నగరం కొత్త రోడ్డు

మామిడికుదురు, జూలై 14: నగరం నుంచి మానేపల్లి వరకు వెళ్లే రోడ్డు, భవనాలశాఖ రహదారి గోతులు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం నగరం, పెదపట్నం, మానేపల్లి గ్రామానికి చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మానేపల్లిలంక నుంచి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరిపి ఈరోడ్డుపై లారీలు ప్రయాణించడం వల్ల గోతులు పడి అధ్వానంగా తయారైంది. రోడ్డుపైన గల పలు వంతెనలు శిథిలమై ప్రమాదకరంగా మారినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈరోడ్డును ఆధునికీకరించి కష్టాలను గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం రోడ్లు అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.



గోతులు పడి అధ్వానంగా తయారైన నగరం కొత్త రోడ్డు

'అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సర్వేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలి'

అమలాపురంటౌన్, జూలై14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పేషీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఈరంకి సర్వేశ్వరరావు అక్రమాలపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని రావులపాలెం గ్రామానికి చెందిన బి.అనంతలక్ష్మి కోరారు. ఈమేరకు ఆమె అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు ఫిర్యాదు అందించింది. కలెక్టర్ పీఏగా చలామణి అవుతూ ప్రతి పనికీ ఒక రేట్ ఫిక్స్ చేసి అధికంగా సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చిన్న ఫైల్‌కు తొలుత రూ.20వేలు సమర్పించాలని, కలెక్టర్ సంతకం అయిన తర్వాత ఫైల్‌ను కింద సెక్షన్‌కు పంపించాలంటే రూ.80వేలు సమర్పించాలన్నారు. సర్వేశ్వరరావు అక్రమాలపై గత కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. సర్వేశ్వరరావు మాటకు ఎదురుచెప్పిన ఎంత ఉద్యోగి అయినా అక్కడి నుంచి బదిలీ అవాల్సిందేనన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అయితే ఉద్యోగం కూడా పోతుందన్నారు. ఈవిధంగా నలుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధులనుంచి తొలగించారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ నలుగురిలో ఒకరైన తనను చెప్పిన మాట వినడం లేదని లైంగికంగా వేధించి ఉద్యోగం నుంచి తీయించి వేశాడన్నారు. ఈవిధంగా గడచిన రెండేళ్లలో లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదించాడన్నారు. అతనికి వైసీపీ నేతల అండదండలు ఉన్నాయన్నారు. సర్వేశ్వరరావుపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని ఫిర్యాదులో వివరించారు. ఎమ్మెల్యే ఆనందరావును వివరణ కోరగా తనకు ఒక మహిళ ఫిర్యాదు చేసిందన్నారు.

శిథిలస్థితికి కాలిబాట వంతెన



శిథిలావస్థకు చేరిన కాలిబాట వంతెన

కపిలేశ్వరపురం, జూలై14:కపిలేశ్వరపురంగ్రామశివారు సత్యనారాయణపురం వద్ద ప్రధాన పంటకాలువపై నిర్మించిన కాలిబాట వంతెనశిథిలస్థితికి చేరింది. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వంతెన అడుగు పైభాగాల్లో సిమెంట్ పెచ్చులూడి, ఇనుప ఊచలు తుప్పుపట్టి పైకి కనిపిస్తున్నాయి. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పలుచోట్ల విరిగిపోగా పలుచోట్ల ఇనుప ఊచలు తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. శిథిలావస్థకు చేరిన వంతెన సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశపరీక్ష

యానాం, జూలై 14: పుదుచ్చేరిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ సీట్ల భర్తీకి యానాంలో జరిగిన బీఎస్సీ నర్సింగ్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం ఉదయం జరిగిన పరీక్షకు 61మంది విదార్థులకు 49మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులు, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. పరీక్ష అనంతరం పత్రాలను ప్రత్యేక వాహనంలో భద్రత నడుమ పుదుచ్చేరి తరలించారు. రెండు రోజుల్లో ఫలితాలు ప్రకటిస్తారు.

వర్షం నీటిలో పల్లపు ప్రాంతాలు



అంతర్వేది కొత్తపేట వద్ద ఇళ్లను తాకిన వర్షం నీరు



మలికిపురం: తూర్పుపాలెంలో అధ్వానంగా రోడ్డు

అంతర్వేది, జూలై14: వైసీపీ ప్రభుత్వంలో రోడ్లకు మరమ్మతులు కూడా చేయకపోవడంతో వర్షానికి రోడ్లు ఛిద్రంగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అంతర్వేది తీర ప్రాంత గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లోని ఇళ్ల చుట్టూ నీరు చేరింది. అంతర్వేది కొత్తపేట వద్ద మెరక మీద ఉన్న ఇళ్ల చుట్టూ వర్షం నీరు చేరడంతో గ్రామస్తులు ఇక్కట్లకు గురవుతున్నారు. పుంత రోడ్లు, మట్టి రోడ్లు బురదమయం కావడంతో రైతులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల్లో ఉన్న పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. అంతర్వేది, పల్లిపాలెం, దేవస్థానం, కేశవదాసుపాలెం, గొంది గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాల్వలు, పంటబోదెలు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్లు ఏర్పాటుచేసి భారీ వర్షాలకు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి ఛిద్రమైన రోడ్లు

మలికిపురం, జూలై 14: ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం పంచాయతీల్లోని నిధులను ఇతర కార్యక్రమాలకు తరలించడంతో గ్రామాల్లో రోడ్లకు మరమ్మతులు చేయలేని పరిస్థితికి ఏర్పడింది. తూర్పుపాలెం, కేశనపల్లి, మలికిపురం వంటి గ్రామాల్లో గోతులు పడిన రోడ్లతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

శాకంబరిగా సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం, జూలై14: సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుమ్మళ్ల రాము సమకూర్చిన పలురకాల కూరగాయలతో అమ్మవార్ని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రోచర్ల నాగభూషణం, గొలకోటి మల్లిబాబు అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించగా భక్తులకు ప్రసాదంగా అందించారు. వేముల వెంకన్నబాబు చిన్నపిల్లలకు ఉచితంగా పాలు పంపిణీ చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక భజన ఏర్పాటుచేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

శాకంబరిదేవిగా సత్తెమ్మతల్లి అమ్మవారు

ముమ్మిడివరం, జూలై 14: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి ఘంటావారివీధిలోని సత్తెమ్మతల్లి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు.

శాకంబరిగా అశ్వరూడాంబిక

అంతర్వేది, జూలై 14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అనుబంధ ఆలయం, స్వామివారి సోదరి



సత్తెమ్మతల్లి, అశ్వరూడాంబిక

గుర్రాలక్కవ్మ (అశ్వరూడాంబిక) అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి అనంతరం కాయగూరలతో అలంకరించారు. అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సందర్శకులు పుణ్యక్షేత్రాలను సందర్శించారు.సాయంత్రం బీచ్‌లో పర్యాటకులు సందడి చేశారు.

నిత్యాన్నదానికి రూ.10వేలు విరాళం

మామిడికుదురు, జూలై 14: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన సందూరి సంతోష్, అనంత దంపతులు ఆదివారం రూ.10,002 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

గంజాయి అరికట్టడానికి ప్రణాళిక సిద్ధం: మంత్రి

ద్రాక్షారామ,జూలై14: నియోజకవర్గంలోగంజాయి రవాణా, వాడకం అరికట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం వెలంపాలెంలో నంగిగోవిందు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విజయోత్సవ సభలో మంత్రి మాట్లాడారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో వ్యవస్థలు పాడయ్యాయన్నారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయం, ఏరియాఆసుపత్రుల్లో అవినీతి చోటు చేసుకుందన్నారు. చివరకు శ్మశానాన్ని కూడా వదల్లేదన్నారు. నాలుగున్నరేళ్ల వరకు వైసీపీ నుంచి ఎవరినీ పార్టీలో చేర్చుకోబోమన్నారు. జనసైనికుల వల్లే తాను గెలుపొందానని ప్రకటించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు గంధం పల్లం రాజు, వాసంశెట్టి సత్యం, జడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, రేవు శ్రీను, చవ్వాకుల సూర్యభాస్కరరావు, చిక్కాల దొరబాబు, ముప్పనపల్లి గణేష్, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నంగి గోవిందు,జనసేన,టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో నాయకులు

ఓడలరేవు తీరంలో సందర్శకుల సందడి

అల్లవరం, జూలై14: ఓడలరేవు సముద్రతీరంలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. కోనసీమ జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కుటుంబ సమేతంగా గడిపారు. యువతీ, యువకులు ఎగసిపడే కెరటాల మధ్య సముద్ర స్నానాలు చేశారు. కాగా బంగాళాఖాతంలో నెలకొన్న ప్రతికూల వాతావరణంతో తీరంలో అలజడి నెలకొంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో పలుచోట్ల భూమి కోతకు గురైంది.





విద్యార్థుల అ'పూర్వ' కలయిక

అల్లవరం, జూలై14: వారంతా 47ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తాము చదివిన చెట్టు నీడలో రోజంతా సందడి చేశారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలోని న్యాపతి సుబ్బరావు పంతులు జడ్పీహైస్కూల్లో 1976-77బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. పాఠాలు చెప్పిన గురువులు ఆకుల వీరాంజనేయులు, కోరుమల్లి సత్యనారాయణచార్యులను సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. పూర్వ విద్యార్థి, హైస్కూల్ హెచ్‌ఎం మంగళంపల్లి సత్యనారాయణమూర్తి, నార్ని నారాయణమూర్తి, యాళ్ల వెంకటేశ్వరరావు (బుజ్జి), మేకల మూర్తి, ఆదుర్తి గణేష్, మెట్ల సుబ్బలక్ష్మి, బయ్యా సుజాతలతో పాటు పూర్వ విద్యార్థులంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

స్థానిక సంస్థలకు నిధుల విడుదలపై హర్షం

కొత్తపేట, జూలై 14: స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల బలోపేతంపై దృష్టిపెట్టడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. 'తల్లికి వందనం' పథకంపై అపోహలు సృష్టిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం



అమలాపురం టౌన్, జూలై 14: అమలాపురం ప్రాంతానికి చెందిన ముత్తాబత్తుల కుటుంబీకులు ఆదివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించి బుద్ధుని ప్రతిమను అందజేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకురావాలని, అధ్వాన రోడ్లను పునర్నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల వెంకట్రావు, ముత్తాబత్తుల రమణ, ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆనందరావు, శ్రీమన్నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించాలి

అమలాపురం టౌన్, జూలై 14: దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని కార్పెంటర్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా భవన నిర్మాణ రంగ కార్మికులతో పాటు చేతివృత్తులవారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. యూనియన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రమాదాల బారినపడ్డ కార్మికులకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. హరీష్‌మాధుర్‌ను దుశ్శాలువాకప్పి సత్కరించారు. జిల్లా కన్వీనర్ కుసుమే నరసింహరాజు, సంఘ ప్రధాన కార్యదర్శి దంగేటి రామకృష్ణ, కొనుకు వెంకటేశ్వరరావు, వాసర్ల ఈశ్వరరావు, తరెట్ల వెంకటేష్, కుడుపూడి గోపాలకృష్ణ, కొప్పిశెట్టి ఉమామహేశ్వరరావు, వాసంశెట్టి గణేష్, మంకు శివ పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన క్లాస్‌ఫోర్ ఉద్యోగులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 14: మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం రామచంద్రపురం డివిజన్ క్లాస్ ఫ్లోర్ ఉద్యోగుల సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సుభాష్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పడాల సత్యనారాయణ ప్రసాద్, కార్యదర్శి కొప్పిశెట్టి లోకేశ్వరరావు, కోశాధికారి రాంబాబు, జి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓఎంజీ
శ్రీలలిత	: సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	: రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

త్యాగాలకు ప్రతీక మొహర్రం

ద్రాక్షారామ, జూలై 14: త్యాగాలకు ప్రతీక మొహర్రం అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రాత్రి ద్రాక్షారామలో మొహర్రం సంతాప దినాల్లో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. పంజాల్లో పీర్లను దర్శించుకుని, మొహర్రం ప్రార్థనల్లో పాల్గొన్నారు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో ఫ్రెంచ్ జాతీయ దినోత్సవం

యానాం, జూలై 14: పుదుచ్చేరి బీచ్ రోడ్డులోని ఫ్రెంచ్ వార్ మెమోరియల్ వద్ద ఆదివారం ఫ్రెంచ్ జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి కోశుతుగంన్, ఫ్రెంచ్ కౌన్సిల్ జనరల్ లేసీటాల్‌బూట్, ఫ్రెంచ్ అసెంబ్లీ మెంబర్ చంతాల్, యానాం ఫ్రెంచ్ పౌరుల ప్రతినిధి సాదానాల బాబు తదితరులు యుద్ధ స్మారక చిహ్నం వద్ద పూల బోకేలు పెట్టి నివాళులర్పించారు. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానానికి చెందిన ఫ్రెంచ్ పౌరులు, ప్రతినిధులు, సైనికుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ వైద్యులు



ఎమ్మెల్యే బుచ్చిబాబును సన్మానిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీలు

ముమ్మిడివరం/ ఐ.పోలవరం, జూలై14: ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలకు చెందిన ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ వైద్యులు ఆదివారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిశారు. అధిక మెజార్టీతో గెలుపొందిన సుబ్బరాజుకు వైద్యులు శుభాకాంక్షలు తెలిపి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. పీఎంపీ, ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కుంచెనపల్లి సత్యనారాయణ, రెడ్డి గంగాధరరావు, వేములవలస చిన్నారావు, కె.వెంకటేశ్వరరావు, కుమార్, పీబీ సుబ్రహ్మణ్యం, యు.వెంకటేశ్వరరావు, ఆర్.ప్రసాద్, సీహెచ్ సత్యనారాయణ, పి.సుబ్రహ్మణ్యం, సభ్యులు ఆకుల సత్తిబాబు, ఉంగరాల వీరేశ్వరరావు, పేరాబత్తుల రామకృష్ణ, కేతా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో 'బాలోత్సవం'

కొత్తపేట, జూలై 14: జితేంద్ర సేవా ఫౌండేషన్, మనం ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చేనెల 10,11తేదీల్లో కొత్తపేటలో జరిగే కోనసీమ బాలోత్సవం విజయవంతం కావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆకాంక్షించారు. బాలోత్సవం బ్రోచర్‌ను ఆదివారం కాపు కల్యాణ మండపంలో ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారిలో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, కంఠంశెట్టి శ్రీనివాస్, కముజు వెంకటేశ్వరరావు, మట్టపర్తి జితేంద్రకుమార్, కె.వీరబాబు, కర్రి కాశీవిశ్వనాథం, వై.పవన్‌కుమార్, పి.రామకృష్ణ, రాయుడు దుర్గారావు, బొక్కా కిరణ్‌బాబు, బి.ఆనందపట్నాయక్, ఎం.నాగమల్లేష్, బాలాజీ, కుసుమ, పద్మ పాల్గొన్నారు.

బాలుడి చికిత్సకు సాయం

రావులపాలెం, జూలై 14: వెదిరేశ్వరం శివారు మూలగూడేనికి చెందినఇళ్ళ వెంకటేశ్వరరావు-నాగలక్ష్మి దంపతుల నాలుగు నెలల చిన్నారి అఖిల్ లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్ తీసుకెళ్లి చూపించగా లివర్ మార్పు చేయాలని, వైద్యానికి రూ.20లక్షలు అవుతుందని చెప్పారు. కొత్తపేట మండల యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు ఆదివారం రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బొక్కా ప్రసాద్, యనమదల శ్రీనివాస్, శీలం కొండబాబు, ముషిణి వెంకటరమణ, కడలి భీమా, మామిడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను తిప్పికొట్టడంలో ఐటీడీపీది కీలక పాత్ర



ఐటీడీపీలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని సన్మానించిన నామన రాంబాబు, ఇతర నేతలు

పి.గన్నవరం, జూలై14: వైసీపీ ప్రభుత్వ అరాచకాలను, అసత్యప్రచారాలను తిప్పికొట్టడంలో ఐటీడీపీ కీలకపాత్ర పోషించిందని నియోజకవర్గ కోఆర్డినేషన్ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఐటీడీపీ విభాగంలో చురుకైన పాత్ర పోషించిన 21మందిని, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.బాలజీవేమాలను దుశ్శాలువాలతో సన్మానించారు. మొదటి గ్రేడ్ సాధించిన వారికి గోల్డ్ కలర్ సైకిల్‌బ్యాడ్జ్, రెండో గ్రేడ్ సాధించిన వారికి పోల్‌విత్ జెండాతో కూడిన బ్యాడ్జ్‌ను అందించారని నామన తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ కోకన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సభ్యులు తోలేటి సత్తిబాబు, చిట్టూరి శ్రీనివాస్, మొల్లేటి శ్రీను, నాయకులు మద్దాల సుబ్రహ్మణ్యం, బోణం బాబు, నేదునూరి వీర్రాజు, సంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు, నక్కా సత్యనారాయణ, బొంతు పెదబాబు, గుడాల ఫణి, శేరు శ్రీనుబాబు, కె.సత్యనారాయణరాజు, ఎన్.శేషయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

ముమ్మిడివరం, జూలై 14: మహిళలు పరిసరాల పరిశుభ్రతతో పాటు రుతుక్రమ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కేజీ పీజీ బేసిన్ మేనేజర్ కె.కరవరన్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో ఆదివారం పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టి.నాగరాజారావు అధ్యక్షతన స్వచ్ఛత పక్వాడాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పద్ధతులపై అవగాహన కల్పించారు. ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమలాపురం, ముమ్మిడివరం బీసీబాలికల వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు 135మందికి జూట్‌బ్యాగులు, ఎస్ఎస్ వాటర్‌బాటిళ్లు, హైజనిక్ కిట్లను ఆయన అందించారు. చీఫ్ జనరల్ మేనేజర్ మురుగేషన్, ఓఎన్జీసీ సీఎస్ఆర్ కోఆర్డినేటర్ కె.ముత్తయ్య, సబిత, సాహో శ్రీనివాస్, భారతి, కన్నీడి వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, కార్తీక్, శివకుమార్, లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ జాతర మహోత్సవం

అమలాపురం టౌన్, జూలై 14: ఆంధ్రా ఆటోవాలా వర్కర్స్ యూనియన్, విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ హైస్కూలు సెంటర్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సుబ్బాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైస్కూలు సెంటరు నుంచి గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు జరిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో గ్రామ దేవత సుబ్బాలమ్మకు కార్మికులు మొక్కుబడులు తీర్చుకునేందుకు వందలాదిగా తరలివెళ్లారు. జాతరలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, నాయకులు మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, వాసర్ల వెంకన్న, కుడుపూడి బాబు, వాసర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన టీడీపీ నాయకులు

మామిడికుదురు, జూలై 14: మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం రామచంద్రపురంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురైన టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి శంకరరావు ఆరోగ్య పరిస్థితిని మంత్రికి వివరించారు. ఈవిషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లుగా నాయకులు తెలిపారు. అనంతరం మంత్రిని దుశ్శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో ఈలీ శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, కడలి నూకరాజు, అప్పారి వెంకటేశ్వరరావు, సాపె ఏకదశి, పెచ్చెట్టి విజయభాస్కరావు తదితరులు ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, జూలై14: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పలు కుటుంబాలను పరామర్శించారు. రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ దుగ్గిరాల దుర్గాప్రసాద్ షిర్డీలో గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం రామ చంద్రపురంలో కుటుంబ సభ్యులను వేగుళ్ల పరామర్శించారు. అర్తమూరుకు చెందిన చిర్ల లలితాదేవి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. టీడీపీ నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కర్రి జంబయ్యరెడ్డి పాల్గొన్నారు.

వెదురుపాకలో ఘనంగా గురుపూజోత్సవం

రాయవరం, జూలై 14: వెదురుపాక గీతా మందిరంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ ఆవి ర్భావం ఆవశ్యకతను తెలుగు ఉపాధ్యాయుడు నాగ సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పడాల శివ మణికంఠరెడ్డి, అంగర జనార్థనాచార్యులు, పి.నాగరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీహెచ్‌వీవీఎస్ఎన్ మూర్తి, ఎం.గణేష్‌రెడ్డి, ఎస్.రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కొమరగిరిపట్నంలోని ఆర్ష విజ్ఞాన భారతి స్కూలులో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ప్రజల హృదయాల్లో ధర్మం, దేశ భక్తి పెంచాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్ఎస్ఎస్ సంపర్క్ ప్రముఖ్ ఋలుసు జగదీష్ కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు బీఎల్ఎన్ పవన్, పులిమే రాజా, అల్లూరి సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత తహశీల్దారు ఇంట్లో చోరీ

అంబాజీపేట, జూలై14: విశ్రాంత తహశీల్దారు ఇంట్లో దొంగతనం జరిగింది. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన విశ్రాంత తహశీల్దారు రాయుడు సత్యనారాయణమూర్తి భార్యతో కలిసి ఈనెల8న వైద్యం కోసం కాకినాడ వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం వారు ఇంటికి వచ్చారు. బీరువాలో ఉండాల్సిన రూ.15 వేలు నగదు, రెండు కిలోల వెండి పూజా సామగ్రి, పది గ్రాముల బంగారాన్ని దొంగలు అపహరించారు. అంబాజీపేట ఏఎస్ఐ సూర్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది.

వస్కులర్ సమస్యలపై జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట, జూలై 14: వస్కులర్ సమస్యలను ముందుగా గుర్తించి జాగ్రత్తలు పాటించాలని హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వస్కులర్ వైద్యులు డాక్టర్ సోమచారి అన్నారు. స్థానిక సత్యసాయి సేవాసమితి, ఏషియన్ వస్కులర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ డిల్లీబాబు ఆసుపత్రి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలు పిక్కల వద్ద మజిల్స్‌లో రక్తం ఎక్కువగా నిల్వ ఉంటే రక్తనాళాలు ఉబ్బి ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమస్యను ముందుగా గుర్తించి వైద్యం చేయించుకోవాలన్నారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు తిరుపూరి బాబా, మన్యం వర్ధనరావు, అడపా ప్రసాదు, మంచాల శేషు, నిట్టాల రమేష్, కొల్లూరి దివాకర్ పాల్గొన్నారు.